క్లుప్తంగా

ఆరో అదనపు జిల్లాకోర్టు ఏఓగా రవి


ఏఓ రవి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని 6వ అదనపు జిల్లాకోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బోయినపల్లి రవి పదోన్నతి పొందారు. బుధవారం హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు.. 6వ అదనపు జిల్లాకోర్టులో సీనియర్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న రవిని పదోన్నతిపై ఇదే కోర్టులో ఏఓగా నియమించారు. ఈ మేరకు కోర్టు ఉద్యోగులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఎవరూ అధైర్యపడొద్దు..


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

వైరా: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత గ్యారంటీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, బీఆర్‌ఎస్ ఓటమికి కార్యకర్తలు అధైర్య పడొద్దని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ అన్నారు. బుధవారం వైరాలోని మిట్టపల్లి గార్డెన్స్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

వేతనం మంజూరు చేయాలి

మధిర: ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ప్రభుత్వం తరపున విధులు నిర్వహించిన వీడియో గ్రాఫర్లు, ఫొటోగ్రాఫర్లకు వెంటనే గౌరవ వేతనం విడుదల చేయాలని మధిర మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ అంగడాల పార్వతి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆర్డీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికలు పూర్తై ప్రభుత్వం కొలువుదీరినప్పటికీ తమకు గౌరవ వేతనం నిధులు విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

మేడేపల్లి విద్యార్థుల ప్రతిభ

ముదిగొండ: మండలంలోని మేడేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, ఇటీవల ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన అథ్లెటిక్స్ అండర్14 బాలుర ట్రై అథ్లెట్ గ్రూపు ఏ విభాగంలో ఆనంద్ తీర్థ సిల్వర్‌మెడల్ సాధించగా.. అండర్ బాలికల విభాగంలో లాంగ్‌జంప్‌లో ఎం.యువ వర్షిణి కాంస్య పథకం సాధించారని పాఠశాల పీఈటీ బి.కృష్ణయ్య బుధవారం తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపీపీ సామినేని హరిప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ సమత, పీఈటీ కృష్ణయ్య అభినందించారు.

జర భద్రం..!

కమ్మేస్తున్న పొగమంచు

- వాహనదారులూ తస్మాత్ జాగ్రత్త
- నిర్ణీత వేగంతో ప్రయాణమే సురక్షితం
- నిత్యం వెళ్లే మార్గమేనని నిర్లక్ష్యం చేయొద్దు..


పొగమంచులో లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనాలు

వాహనదారులు చలికాలం జరభద్రం..! ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా.. ప్రమాదం కొని తెచ్చుకున్నట్టే.. నిత్యం వెళ్లే మార్గమే కదా అనుకొని వేగంగా దూసుకెళ్తే చిక్కుల్లో పడ్డట్టే..

సత్తుపల్లిటౌన్: ప్రస్తుత శీతాకాలం నేపథ్యంలో రహదారులపై దట్టంగా కమ్మేసిన పొగమంచు రోడ్డు ప్రమాదాలకు కారణమౌతుంది. అతివేగానికి తోడు పొగమంచుతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాల భారిన పడుతున్నారు. నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో అర్ధరాత్రి నుంచి ఉదయం 9 గంటల వరకు కమ్మేసి ఉంటుంది. తెల్లవారుజామున ఉదయం 8 గంటల వరకు సూర్యుడు కనిపించని పరిస్థితి. ఇలాంటి సమయాల్లో వేకువజామున ప్రయాణం చేసేవారికి ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలకు గురైన సంఘటనలు జిల్లాలో చోటు చేసుకుంటున్నాయి.

అప్రమత్తత అవసరం..

లోతట్టు ప్రాంతాలు, చెరువులు, చెట్లు, తోటలు ఎక్కువగా ఉండే చోట పొగమంచు ఎక్కువగా ఉంటుంది. కావున తెల్లవారుజామున దూరప్రయాణాలు చేసే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి. పరిమిత వేగంతో వాహనం నడపాలి. వాహన హెడ్‌లైట్లు ప్రసరించిన దూరం స్పష్టంగా కన్పిస్తుందో లేదో గుర్తిస్తూ వాహనం నడపాలి. ఈ పొగమంచు కారణంగా వాహన చోదకులకు పాదాచారులు, ఇతర వాహనదారులు సైతం దగ్గరగా వచ్చే వరకు గమనించలేని పరిస్థితి ఉంటుంది.

తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారిపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పొగమంచు మరీ ఎక్కువగా ఉంటే ప్రయాణాన్ని ఆపివేయటం మంచిది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలకు గురికావాల్సి వస్తోంది. వాహనదారులు భద్రత పాటిస్తేనే ప్రయాణం సాఫీగా సాగుతుంది.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- రోడ్డు స్పష్టంగా కనిపించకపోతే సురక్షితమైన స్థలంలో వాహనాన్ని ఇతర వాహనాలకు కనిపించే విధంగా ఆపేయాలి.
- ప్రయాణ సమయంలో ఇతరులకు స్పష్టంగా కనిపించేలా వాహనం లైట్లను ఆన్‌చేసి ఉంచడంతో పాటు నెమ్మదిగా వెళ్లాలి.
- వాహనాల మధ్య ఖచ్చితమైన దూరం పాటించాలి. మలుపులు, డివైడర్ల వద్ద సూచికలు గమనించి జాగ్రత్తగా వెళ్లాలి. వాహనాలను ఓవర్‌టేక్ చేయకూడదు.
- రాత్రివేళ, తెల్లవారుజామున మంచు ప్రభావం ఎక్కువ. ఈ సమయంలో ప్రయాణం వాయిదా వేసుకోవటం మంచిది.
- కారు నడిపేటప్పుడు అద్దాలు స్పష్టంగా కనిపించేలా ఏసీ బ్లొజర్ కండీషన్‌లో పెట్టుకోవాలి. బ్రేకులు కండీషన్‌లో ఉండాలి.
- చలికి చేతులు పట్టుత్వాన్ని కోల్పోయే అవకాశం ఉంది.. కావున జాగ్రత్తలు తప్పనిసరి.



- రోడ్డుపై రేడియం లైనింగ్, స్టిక్కర్ల సూచికలు గమనించాలి.
- రహదారి పక్కన వాహనాలు నిలిపి ఉంటే సూచికలు ఏర్పాటు చేసుకోవాలి.
- వాహనం ముందు, వెనుక రేడియం స్టిక్కర్లు అతికించాలి. హెడ్‌లైట్లు, పార్కింగ్‌లైట్లు వేసి డ్రైవింగ్ చేయటం వల్ల ముందు, వెనుక వచ్చే వాహనాలకు స్పష్టంగా అర్థమౌతుంది.

సరైన జాగ్రత్తలు పాటించాలి..



పొగమంచు సమయంలో వాహనాలు నడిపేటప్పుడు సరైన జాగ్రత్తలు పాటించాలి. అప్పుడే సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవచ్చు. పొగమంచు ఉంటే ప్రయాణాలు తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలి. కార్లు నడిపేటప్పుడు సీటుబెల్ట్, ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, హ్యాండ్‌గ్లౌజ్, జర్కిన్లు ధరించాలి.

– సంగం వెంకటపుల్లయ్య, ఎంవీఐ, సత్తుపల్లి

ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి


ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు వసంత

చింతకాని: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని వైద్యురాలు వల్లూరి వసంత అన్నారు. మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ సహకారంతో మండల విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో ప్రత్యేక అవసరాలు కల్గిన దివ్యాంగ పిల్లలకు బుధవారం ఫిజియోథెరపీ వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు కేవీఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, భవిత కేంద్రం సంరక్షురాలు అరికొట్ల లలితకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంపదలు ఇచ్చే వ్రతం తిరుప్పావై..


భక్తులకు ప్రవచనాలు వినిపిస్తున్న నల్లాన్ చక్రవర్తుల సీతారామానుజాచార్యులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం రేజర్ల శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆళ్వార్‌దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బుధవారం ప్రముఖ ప్రవచనకర్త నల్లాన్ చక్రవర్తుల సీతారామానుజాచార్యులు భక్తులనుద్దేశించి తిరుప్పావై ప్రవచనాలు వినిపించారు. ఈ కలియుగంలో గోదాదేవి శ్రీవిష్ణు చిత్తూరు అనే మహానుభావునికి తులసి వనంలో దొరికింది ఆమె భగవంతుడి కోసం ఒక వ్రతం చేసింది. దానికి తిరుప్పావై, ధనుర్మాస వ్రతం అన్నారు. ఇది సంపదలు ఇచ్చే వ్రతం. అంటే ఈ లోకంలో నీకు కావలసినటువంటి ధన, ధాన్య, ఐశ్వర్య, ఆయురారోగ్యాలు మొదలైన సంపదలు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నారెడ్డి, ధర్మకర్తలు పుల్లారెడ్డి, వసంత లక్ష్మి, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

'అధికారులే అభివృద్ధిని అడ్డుకుంటున్నారు'

కారేపల్లి: దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న కారేపల్లిలోని శ్రీవేంకటేశ్వర స్వామి (సంతగుడి) దేవస్థానం అభివృద్ధిని అడ్డుకోవాలని ఆలయ మేనేజర్ శేషయ్య చూస్తున్నాడని.. సంతగుడి చైర్మన్ అడ్డగోడ ఐలయ్య అన్నారు. బుధవారం కారేపల్లి సంతగుడి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంతగుడి ప్రహరీ నిర్మాణ అనుమతులకై దేవాదాయ శాఖకు దరఖాస్తు చేశామని, ఈ క్రమంలోనే.. కొంతమంది దాతలు సాయమందించేందుకు ముందుకు వచ్చారని, వారందరికీ రశీదులు ఇవ్వడానికి సైతం సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆలయ మేనేజర్ శేషయ్య అలసత్వం వహిస్తూ.. ఆలయ అభివృద్ధికి ఎలాంటి అనుమతులు లేవని, పత్రికా ప్రకటనలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. ఇదిలా ఉండగా.. సంతగుడి సర్వేనంబర్ 197లో 3.05 ఎకరాలు, సర్వే నంబర్ 202లో 1.05 ఎకరాలు ఉండగా.. కొంత భాగం ఆక్రమణకు గురైందని, సర్వే చేపట్టి హద్దులు నిర్ణయించాలన్నారు. ఇప్పటికైనా దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

సింగరేణి ఎన్నికలు ప్రశాంతం

సత్తుపల్లిలో 94.6 శాతం పోలింగ్


సింగరేణి ప్రధాన కార్యాలయానికి బ్యాలెట్ బాక్స్‌లను తరలిస్తున్న అధికారులు

సత్తుపల్లి: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు బుధవారం సత్తుపల్లిలో ప్రశాంతంగా జరిగాయి. 94.6శాతం పోలింగ్ నమోదైంది. సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ, సీహెచ్‌పీ వద్ద పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఉదయం 7 గంటల నుంచి కార్మికులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. జేవీఆర్ ఓసీలో 613 మంది కార్మికులకు గాను 579 మంది, కిష్టారంలో ఓసీలో 137 మంది కార్మికులకు 130 మంది, సీహెచ్‌పీలో 248 మందికి 228 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 998 మందికి గాను 937 ఓట్లు పోల్‌కాగా 61 మంది గైర్హాజరయ్యారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను కొత్తగూడెం ప్రధాన కార్యాలయానికి కౌంటింగ్ కోసం పటిష్ట బందోబస్తుతో తరలించారు. ఎన్నికలను ప్రాజెక్టు అధికారి ఎస్.వెంకటాచారి, కల్లూరు ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి, ఏసీపీ రామానుజం, సీఐ మోహన్‌బాబు పర్యావేక్షించారు. జేవీఆర్ ఓసీకి వెళ్లే మార్గంలో పోటీలో ఉన్న కార్మిక సంఘాలు ఎన్నికల శిబిరాలను ఏర్పాటు చేశాయి. ఏఐటీయూసీ శిబిరాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించారు. ఐఎన్‌టీయూసీ శిబిరాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్, ఉడతనేని అప్పారావు, రావి నాగేశ్వరరావులు సందర్శించారు.

ఎమ్మెల్యే రాగమయి రాకతో ఉద్రిక్తత..

సింగరేణి ఎన్నికల నేపథ్యంలో స్థానిక జేవీఆర్ ఓసీలోని పోలింగ్ కేంద్రానికి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి చేరుకోవటంతో ఏఐటీయూసీ నాయకులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులకు, ఏఐటయూసీ నాయకులకు వాగ్వాదం జరిగింది. అంతకుముందుగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు జేవీఆర్ ఓసీ వద్దకు చేరుకోగా అనుమతి లేదంటూ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారని, స్థానిక ఎమ్మెల్యేకు మాత్రం ఈ నిబంధనలు ఎందుకు వర్తించవంటూ ఏఐటీయూసీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సీఐ మోహన్‌బాబు ఇరుపక్షాలకు సర్ది చెప్పటంతో ఆందోళన విరమించారు.

సింగరేణి పరిరక్షణ ఏఐటీయూసీతోనే సాధ్యం


మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సత్తుపల్లిటౌన్: సింగరేణి కార్మికుల హక్కులు, చట్టాలు పరిరక్షణ ఏఐటీయూసీకే సాధ్యమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో సింగరేణి ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా బుధవారం ఏఐటీయూసీ ఎన్నికల శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు అనుబంధంగా ఉన్న టీబీజీకేఎస్ సంఘం గత ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత సింగరేణి సంస్థలో కుంభకోణాలకు పాల్పడిందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనాలు, బోనస్‌లు, ఇంక్రిమెంట్లు సకాలంలో ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. సింగరేణి ప్రైవేటీకరణ జరగకుండా అడ్డుకోవడం తమతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర ఏఐటీయూసీ కార్యదర్శి సింగు నర్సింహారావు, నాయకులు దండు ఆదినారాయణ, తాటి వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ, రామాంజనేయులు, మేకల శ్రీనివాస్, స్వామి, యోబు, రామకృష్ణ, సుధాకర్, నర్సింహారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం చేరిన 'అయోధ్య' అక్షింతలు


అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు


కారేపల్లి: అయోధ్య అక్షింతలను ఆలయానికి తీసుకొస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: అయోధ్యలో రామ మందిరం నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో అక్కడ నుంచి స్వామి అక్షింతలు బుధవారం ఎర్రుపాలెంలోని శ్రీబాలత్రిపుర సుందరీ సమేత శ్రీచంద్రమౌళేశ్వర స్వామి (శివాలయానికి) చేరుకున్నాయి. వీటిని నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేశ్వరశర్మ, ఎర్రుపాలెం సహసం యోజక్ పింగళి శ్రీనివాసరావులు.. శివాలయ అర్చకుడు గోపాలకృష్ణశర్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు కోటేశ్వరరావు, చంద్రమౌళేశ్వరరావు, ధర్మ, ప్రేమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కారేపల్లిలో పంపిణీ..

కారేపల్లి: కారేపల్లికి చేరిన అయోధ్య అక్షింతలను కారేపల్లి భక్త బృందం ఎదురేగి ఊరేగింపుగా సాయిబాబా ఆలయానికి తీసుకువచ్చారు. వీటిని 41 గ్రామ పంచాయతీలకు పంపిణీ చేశారు. ఈ అక్షింతలను గ్రామంలోని ఆలయంలో ఉంచి, జనవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఇంటింటికీ పంపిణీ చేయడం జరుగుతుందని భక్త మండలి తెలిపారు.

కరసేవకునికి సన్మానం..

1992లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య రామ మందిర నిర్మాణానికి వెళ్లిన కర సేవకుడు తురక నారాయణను బుధవారం సన్మానించారు. అయోధ్య రామమందిరం కల సాకారమైన వేళ కర సేవకులను రామభక్త మండలి ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో భక్త మండలి సభ్యులు జంగా వెంకటేశ్వర్లు, గొడుగు శ్రీనివాస్, నర్సింహారావు గుప్తా, వెంకటేశ్వర్లు, బుచ్చిబాబు, కొమరయ్య, పిచ్చయ్య, రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు నిలిపివేత

వైరా: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో గత ఆరు నెలల క్రితం మంజూరైన రోడ్డు విస్తరణ పనులను నిలిపివేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆ శాఖ ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. స్థానిక క్రాస్ రోడ్డు నుంచి సోమవరం గ్రామ సమీపం వరకు ఒకటిన్నర కిలోమీటర్ల మేర రూ.12 కోట్లతో మంజూరైన పనికి టెండర్లు కూడా పూర్తయ్యాయి. అగ్రిమెంట్ అవ్వాల్సి ఉన్న క్రమంలో గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులన్నీ నిలిచిపోవడం.. ఇక్కడి రోడ్డు విస్తరణలో భాగంగా సెంట్రల్ లైటింగ్, డివైడర్‌లు వంటి నిర్మాణాలు నిలిచి పోనున్నాయి.

వాహనదారులు సద్వినియోగం చేసుకోండి

కారేపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ ట్రాఫిక్ చాలాన్లపై ప్రకటించిన రాయితీని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించే వారి సంఖ్య నానాటికి పెరిగిపోతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని, ఆర్టీసీ వాహనాల ట్రాఫిక్ చలానాపై 90శాతం రాయితీ ఇవ్వగా, టూవీలర్, ఆటోలపై 80శాతం, కార్లకు, హెవీ వెహికిల్స్ పై60శాతం రాయితీ ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ రాయితీ డిసెంబర్ 26వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకు ఉంటుందని, పెండింగ్ చాలాన్లు ఉన్న వాహనదారులు ఆన్‌లైన్‌ల ద్వారా, లేదా మీసేవల ద్వారా చెల్లించాలన్నారు.

క్రిస్మస్ కానుకలు పంపిణీ

మధిర: క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని కాంగ్రెస్ ప్రభుత్వం అందించే కానుకలను బుధవారం అంబేడ్కర్ లెదర్ పార్క్ ఇండస్ట్రియల్ కో ఆపరేటివ్ సభ్యులకు.. మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగా హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై అందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కటుకూరి శ్యామలరావు, డైరెక్టర్లు మోదుగు రాజారావు, కంటేపూడి రెబ్బమ్మ, ఏసుప్రభు, జమలయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

వైరారూరల్: మండలంలోని కనకగిరి సిరిపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో 2022–23 పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బుధవారం కందిబండ్ల బాలమురళీకృష్ణ జ్ఞాపకార్థం అతని సతీమణి శైలజ, కుమారులు రాజేష్, రాకేష్‌లు నగదు ప్రోత్సాహం అందించారు. ఫస్ట్ ర్యాంకు సాధించిన వాకదాని రాణికి రూ.10 వేలు, సెకండ్ ర్యాంకు సాధించిన యంగల నాగేశ్వరికి రూ.5 వేలు, మూడో ర్యాంకు సాధించిన మనోహర్, వెంకనారాయణలకు ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున నగదు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యప్రసన్నాంబ, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన డీసీసీబీ చైర్మన్ కూరాకుల


తల్లాడ: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయ్ కొణిజర్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం బుధవారం తల్లాడకు వెళ్లి విజయ్ భౌతికకాయాన్ని సందర్శించిన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో డీసీసీబీ సీఈఓ రెహమాన్, కుర్నవల్లి సొసైటీ చైర్మన్ అయిలూరి ప్రదీప్‌రెడ్డి, దూపాటి భద్రరాజు తదితరులు ఉన్నారు.


చంద్రశేఖర శర్మ మృతికి నివాళి


కల్లూరురూరల్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పాయపూరు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ చంద్రశేఖర శర్మ మృతికి పలువురు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, కల్లూరు మండల నాయకులు పసుమర్తి చందర్‌రావు, సత్యం, సత్యం బాబు, అన్నం రాజు, మోహన్ నాయక్, శివనాయక్, తురాబ్ అలీ, ఉస్మాన్, నారపరెడ్డి తదితరులు నివాళులు అర్పించారు.

పథకాలకు దరఖాస్తు చేసుకోండి

గురువారం నుంచి జరగబోయే ప్రజాపాలన గ్రామ సభలకు హాజరై ప్రభుత్వం నుంచి మంజూరయ్యే సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని పలువురు అధికారులు తెలిపారు. పురుషులకు, మహిళలకు వేర్వేరు కౌంటర్లు ఉంటాయని తమ దరఖాస్తులను నింపి కౌంటర్లలో ఉన్న అధికారులు, సిబ్బందికి అందించాలన్నారు. లబ్ధిదారులు ఎవరూ ఇబ్బందులు పడకుండా పకడ్బందీగా గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు.


మధిర: మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ గణేష్


వైరా: సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్


పెనుబల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

మధిర: మధిర రైతు వేదికలో నిర్వహించిన ప్రజాపాలన సన్నాహక సమావేశంలో బుధవారం మధిర నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ గణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామసభల వివారాలు తెలిపారు. 28న బయ్యారం, వెంకటాపురం, సైదేల్లిపురం, నక్కల గురుబు, 29న మాటూరు, కాజీపురం, రొంపిమల్ల, తొండల గోపవరం, జాలిముడి, దేశనేని పాలెం, 30న నాగవరప్పాడు, మల్లారం, అల్లినగరం, రామచంద్రాపురం, జనవరి 2న సిద్దినేనిగూడెం, ఇల్లూరు, మునగాల, 3న చిలుకూరు, మాటూరుపేట, 4న ఖమ్మంపాడు మహాదేవపురం, 5న రాయపట్నం, ఆత్కూరు, వంగవీడు, 6న దెందుకూరు, నాదానపురం, సిరిపురం గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ సీలార్ సాహెబ్, మున్సిపల్ కమిషనర్ అంబటి రమాదేవి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైరా: స్థానిక రైతు వేదికలో బుధవారం అధికారులు ప్రజాప్రతినిధులతో నిర్వహించిన ప్రజాపాలన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ పాల్గొని మాట్లాడారు. అదే విధంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతీ ఇంటికి పంచాయతీ కార్యదర్శి దరఖాస్తులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కస్తాల సత్యనారాయణ, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఏఓ పవన్‌కుమార్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఉదయశ్రీ , ఎంపీపీ వేల్పుల పావని, ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ కరుణాకర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లాల్‌మహ్మద్, సర్పంచ్‌లు మురళి, జయరావు పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజా పాలన గ్రామ సభలపై జరిగిన అవగాహన సమావేశంలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. నేడు మంగాపురం, రామచంద్రాపురం, అంబేడ్కర్‌నగర్, రెడ్డిగూడెం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీదేవి, సర్పంచులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: ఎర్రుపాలెంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ దేవరకొండ శిరీష అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో ఏర్పాటు చేసిన సమావేశానికి మండల స్పెషలాఫీసర్ వేణుమనోహర్ హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కవిత, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఉషాశారద, ఈఓఆర్డీ శ్రీలక్ష్మి, ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు ఉన్నారు.

కొణిజర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన గ్రామసభల నిర్వహణపై బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి మండల ప్రత్యేకాధికారి టి.సుమ హాజరై ప్రసంగించారు. ఎంపీడీఓ కె.మహాలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తఫజుల్ హుస్సేన్, ఎంపీఓ పి.ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేంసూరు: వేంసూరు రైతు వేదికలో బుధవారం వివిధ శాఖల అధికారులకు, ప్రజా ప్రతినిధులకు కల్లురు ఆర్డీఓ అశోక్ చక్రవర్తి అవగాహన కల్పించారు. వేంసూరు మండలంలో నేడు 3 గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని.. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని.. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎంఏ రాజు, ఎంపీడీఓ రమేష్, ఏఓ రామ్మోహన్, ఏపీఎం శ్రీనివాసరావు తదితరుల ఉపాల్గొన్నారు.

ముదిగొండ: ముదిగొండలోని రైతు వేదికలో ఎంపీపీ సామినేని హరిప్రసాద్ అధ్యక్షతన బుధవారం గ్రామ సభలపై నిర్వహించిన ప్రజాపాలన సన్నాహక సమావేశంలో మండల ప్రత్యేకాధికారిణి విజయలక్ష్మి హాజరై మాట్లాడారు. నేడు మండలంలోని అమ్మపేట, పండ్రేగుపల్లిలో ఉదయం 8 నుంచి 2గంటల వరకు, మల్లన్నపాలెం, ఖానాపురంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు దరఖాస్తుల స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్, జెడ్పీటీసీ దుర్గ, తహసీల్దార్ రామారావు, ఎస్సై నరేష్, ఎంపీఓ సూర్యనారాయణ, ఎంఈఓ బీవీ రామాచారి, ఏఓ రాధ, ఏఈలు శ్రీనివాసరావు, నారాయణ, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

చింతకాని: మండల పరిషత్ కార్యాలయంలో ఆరు గ్యారంటీల అమలుపై మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో బుధవారం ట్రైనీ కలెక్టర్ మయాంక్ సింగ్, మధిర నియోజకవర్గ ప్రత్యేకాధికారి, ఆర్డీఓ గణేష్ సమావేశమై మాట్లాడారు. లబ్ధిదారులు దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలతో పాటు ఫొటోను జతచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి సతీష్, ఎంపీపీ పూర్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ రమేష్, ఎంపీఓ రవీంద్రప్రసాద్, మండల వ్యవసాయాధికారి నాగయ్య పాల్గొన్నారు.

పెనుబల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలనపై బుధవారం నిర్వహించిన సభలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పాల్గొని మాట్లాడారు. ఈ క్రమంలో కుల, ఆదాయ పత్రాలతో పాటు ఆధార్ కార్డుల్లో మార్పుల చేర్పులకు పలువురు డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేయడంతో.. వెంటనే మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్ సెంటర్లను తనిఖీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ప్రతాప్‌ను ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి ప్రభుత్వం ఇచ్చే నిబంధనలకు అనుగుణంగా అర్హులకు గుర్తించాల్సన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఈఓ కిషోర్, జెడ్పీటీసీ మోహన్‌రావు, ఎంపీపీ అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

బోనకల్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆర్డీఓ గణేష్ హాజరై మాట్లాడారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంపై రోజువారి నివేదిక కార్యాలయానికి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్, తహసీల్దార్ పున్నం చందర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


కొణిజర్ల: సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సుమ


చింతకాని: మాట్లాడుతున్న ఆర్డీఓ గణేష్